ముదిగొండకు పాలధార

● ప్రారంభానికి సిద్ధంగా బల్క్‌మిల్క్ సెంటర్లు ● మహిళలకు ఆర్థిక భరోసా



ముదిగొండలో ప్రారంభోత్సవానికి సిద్ధంగా బల్క్‌మిల్క్ సెంటర్

ముదిగొండ: మధిర నియోజకవర్గంలో ముదిగొండ, చింతకాని, బోనకల్, మధిర, ఎర్రుపాలెం మండలాల్లో పాల ఉత్పత్తులను సేకరించి, నిల్వచేసే బల్క్ మిల్క్ సెంటర్ల నూతన నిర్మాణాలు చేపట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళల కోసం, పశుపోషకుల కోసం పాల డైరీలను ఏర్పాటు చేసింది. పూర్తి నాణ్యత పరిమాణాలతో బల్క్‌మిల్క్ సెంటర్లను రూ.15లక్షల వ్యయంతో షెడ్డులు నిర్మించారు. చుట్టూ ప్రహరీ, సోలార్ ఫెన్సింగ్, బోరు, మోటార్, వాటర్ ట్యాంక్, గేటును అమర్చి సిద్ధంగా ఉంచారు.

మహిళలు ఎదగాలనే లక్ష్యంతో..

మహిళలు ఆర్థికంగా ఎదగాలనే లక్ష్యంతో ప్రభుత్వం మహిళాశక్తి ద్వారా ఈ పథకాన్ని ఏర్పాటు చేసింది. గత ఏడాది నుంచి స్థలం లేక పోవడంతో అధికారుల సమన్వయ లోపంతో చాలాకాలం, కాలయాపన జరిగింది. దీంతో కలెక్టర్ ముజమిల్ ఖాన్ ప్రత్యేక చొరవ తీసుకుని ప్రజలకు వినియోగవంతంగా ఉండేందుకు, అందుబాటులో ప్రధాన రహదారికి పక్కనే ఉన్న హైస్కూల్, ప్రభుత్వ జూనియర్ కళాశాలకు, గ్రామానికి అనుకూలంగా ఉన్న ప్రదేశాన్ని ఎంపిక చేశారు.

అందరికీ అందుబాటులో..

పాల ఉత్పత్తిదారులు ప్రైవేట్ డైరీలను ఆశ్రయించి నష్టాల బాటలో ఉన్న లబ్ధిదారులకు ఇప్పుడు ఈ డైరీ అందరికీ అందుబాటులోకి రానుంది. మధిర నియోజకవర్గంలో ప్రతి మండలకేంద్రంలో అనుకూలంగా ముఖ్యముగా మహిళలకు ఆసరాగా ఉండేందుకు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తీసుకున్న నిర్ణయంతో, నిధులు మంజూరు చేసి ప్రతీ మండలానికి ఒకటి చొప్పున పాల నిల్వ చేసే కేంద్రాన్ని ఏర్పాటు చేశారు.

మండలంలోని వివరాలిలా..

ముదిగొండ మండలంలోని 25 గ్రామ పంచాయతీల్లో (ఐకేపీ)ఇందిరా కాంతి పథం, (డీఆర్‌డీఏ) గ్రామీణ పేదరిక నిర్మూల సంస్థ ద్వారా గ్రామసమైఖ్యలు (వీఓలు) 57 సంఘాలు, 1,456 స్వయం సహాయక సంఘాలు, (ఎస్‌హెచ్‌జీ) గ్రూపులు, 16,039 మహిళా సభ్యులు ఉన్నారు. ముదిగొండ, వనంవారికిష్టాపురం పశువైద్యశాలలోని 20,258 గేదెలున్నాయి. పశుపోషకులు దాదాపు రోజుకు 2,500లీటర్ల పాల ఉత్పత్తి ఉంటుంది. రానున్న రోజుల్లో మహిళా సంఘాల ద్వారా ప్రతి గ్రామం నుంచి సేకరించిన పాలను ముదిగొండలోని పాలు నిల్వ చేసే కేంద్రంలో ఉంచనున్నారు. ఈ పథకం ద్వారా దాదాపు 12వందల మంది మహిళలకు ఉపయోగపడనున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఈ పాల ఉత్పత్తి మహిళా శక్తికి ఆర్థికంగా ఎదగడానికి ఉపయోగపడనుంది.

బోనస్ ఇవ్వాలి..



దాదాపు 15సంవత్సరాల నుంచి గేదెల ద్వారా పాలను విక్రయిస్తున్నా. ప్రస్తుతం నా దగ్గర పది గేదెలు ఉండగా.. వాటి ద్వారా 18 లీటర్ల పాలు వస్తాయి. అయితే ఐదు లీటర్లు గ్రామంలో ఖాతాలకు పోయగా.. మిగిలిన పాలను ఓ ప్రైవేట్ డైరీకి పోస్తాం. నెలకు దాదాపు రూ.35వేల వరకు ఆదాయం వస్తుంది. ప్రభుత్వం నుంచి రాయితీలు కల్పించి, బోనస్ ఇస్తే బాగుంటుంది.

– ఆవుల ప్రమీలారెడ్డి, పశుపోషకురాలు, బాణాపురం

మండలానికో బల్క్‌మిల్క్ సెంటర్..



మధిర నియోజకవర్గంలో ప్రతి మండలంలో డిప్యూటీ సీఎం చొరవతో నూతనంగా పాలను ఉత్పత్తి చేసేందుకు, మహిళలకు ఎంతో ఉపయోగకరంగా ఉండడానికి ప్రభుత్వ పాల డైరీలను ఏర్పాటు చేసింది. ప్రతీ మహిళ వారి గ్రామంలో పాల డైరీ ఏర్పాటు చేసుకుంటే బాగుంటుంది. వారు ఆర్థికంగా ఎదగడానికి ప్రభుత్వం కృషి చేస్తోంది.

– మందరపు నాగేశ్వరరావు, మాజీ జెడ్పీటీసీ, ముదిగొండ

బహిరంగ సభను విజయవంతం చేయాలి

తల్లాడ: ఈ నెల 27న వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో నిర్వహించనున్న బీఆర్‌ఎస్ రజతోత్సవ బహిరంగ సభను విజయవంతం చేయాలని సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య అన్నారు. గురువారం తల్లాడ మండలం మిట్టపల్లిలో నిర్వహించిన బీఆర్‌ఎస్ మండలస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. వచ్చే నెల 5న మిట్టపల్లిలో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ పర్యటించడంతో పాటు, తల్లాడ మాజీ ఎంపీపీ రాయల శేషగిరిరావు విగ్రహ ఆవిష్కరణలో పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షులు రెడ్డెం వీరమోహన్‌రెడ్డి, మాజీ ఎంపీపీ శ్రీనివాసరావు, కార్యదర్శి వెంకట్‌లాల్, నాయుడు శ్రీనివాసరావు, దాసురావు, చలపతిరావు, మురళీధర్‌రావు, రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మిట్టపల్లిలో పర్యటిస్తున్న మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య

భూసార పరీక్షలు

మధిర: మాటూరు రైతు వేదికలో వ్యవసాయ శాఖ, డిజిటల్ గ్రీన్ అనే స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో గురువారం భూసార పరీక్షలు నిర్వహించారు. ఈ సమావేశంలో ఏడీఏ విజయచంద్ర పాల్గొని మాట్లాడుతూ.. మనిషి ఆరోగ్యానికి వైద్య పరీక్షలు ఎంత అవసరమో.. పంట పండించే భూమికి కూడా భూసార పరీక్ష అంతే అవసరమని తెలిపారు. ప్రతి మూడు సీజన్లకు ఒకసారి భూసార పరీక్ష చేయించుకోవాలని రైతులకు సూచించారు. డిజిటల్ గ్రీన్ కోఆర్డినేటర్ యశోద మాట్లాడుతూ.. తమ సంస్థ ఆధ్వర్యంలో భూసార పరీక్షలే కాకుండా ఫార్మ్ చార్ట్ అనే యాప్ ద్వారా రైతులకు సూచనలు, సలహాలు ఇస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో పాల్గొన్న రైతులకు భూసార పరీక్షలు నిర్వహించి వెంటనే సాయిల్ హెల్త్ కార్డులు అందజేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి సాయి దీక్షిత్, ఏఈఓ నికిత, రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏడీఏ విజయచంద్ర

మండలపరిధిలోని చిరుమర్రిలో..

ముదిగొండ: మండలంలోని చిరుమర్రిలో డిజిటల్ గ్రీన్ సంస్థ ఆధ్వర్యంలో భూసార పరీక్షలపై గురువారం అవగాహన కల్పించారు. నేల నమూనా సేకరణపై రైతులకు అవగాహన కల్పించారు. రైతులకు నేల ఆరోగ్య కార్డులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఓ వేణు, ఏఈఓలు పాల్గొన్నారు.

ఇసుక వేలం పాట

తల్లాడ: అక్రమంగా తరలిస్తుండగా పట్టుబడిన రెండు లారీల ఇసుకను ఈ నెల 28న వేలం వేయనున్నట్లు తల్లాడ తహసీల్దార్ సురేష్‌కుమార్ గురువారం తెలిపారు. ఈ నెల 19న రెండు లారీల్లో ఇసుక తరలిస్తుండగా.. తనిఖీ నిర్వహిస్తున్న తల్లాడ ఎస్సై కొండల్‌రావు పట్టుకుని ఇసుక లారీలను స్టేషన్‌కు తరలించారు. ఈ ఇసుకను సోమవారం ఉదయం 11 గంటలకు నిర్వహించే వేలంలో పాల్గొనే వారు దరావత్ చెల్లించాలని సూచించారు.

ఇంకుడు గుంతలు తప్పనిసరి

సత్తుపల్లిటౌన్: రానున్న వర్షాకాలం సీజన్‌లో భూగర్భ జలాలు పెంపొందించేందుకు ఇంకుడు గుంతలు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని సత్తుపల్లి మున్సిపల్ కమిషనర్ కొండ్ర నర్సింహ అన్నారు. గురువారం పట్టణంలోని పలు వార్డుల్లో ఆయన పర్యటించి డిప్యుటేషన్, ఉద్యోగుల పనితీరును పరిశీలించారు. అపార్ట్‌మెంట్లు, ఖాళీ స్థలాలు, నివాసాల వద్ద ఇంకుడు గుంతలు నిర్మించి జల సంరక్షణ చర్యలు చేపట్టాలని వార్డు ఆఫీసర్లను ఆదేశించారు. పారిశుద్ధ్య పనులు ముమ్మరంగా చేపట్టాలని పేర్కొన్నారు.

మధిర కోర్టు న్యాయమూర్తిగా ప్రశాంతి

మధిర: మధిర కోర్టు న్యాయమూర్తిగా ఎస్ ప్రశాంతి గురువారం బాధ్యతలు చేపట్టారు. సికింద్రాబాద్ మెట్రోపాలిటన్ కోర్టు నుంచి బదిలీపై వచ్చి మధిర సీనియర్ సివిల్ జడ్జి – అసిస్టెంట్ సెషన్స్ జడ్జిగా బాధ్యతలు స్వీకరించారు. ఆమెకు మధిర బార్ అసోసియేషన్ అధ్యక్షులు బోజడ్ల పుల్లారావు ఆధ్వర్యంలో న్యాయవాదులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఇప్పటివరకు ఇన్‌చార్జ్ జడ్జిగా పనిచేసిన ఎస్కే మీరా ఖాసిం సాహెబ్‌తో పాటు నూతన న్యాయమూర్తి ప్రశాంతిని సన్మానించారు.

విద్యార్థినికి రూ.30వేల ఆర్థిక సాయం



గౌతమిని సన్మానించి నగదు అందిస్తున్న దృశ్యం

బోనకల్: స్నేహితుడి కుటుంబానికి తోటి స్నేహితులు ఆర్థిక సాయం అందించి ఉదారత చాటుకున్నారు. మండలంలోని రావినూతల గ్రామానికి చెందిన చేబ్రోలు సైదులు – రాధ ఇటీవల అకాల మరణం చెందారు. వారి కుమార్తె చేబ్రోలు గౌతమి ఇంటర్ ప్రథమ సంవత్సరం ఎంపీసీలో 470 మార్కులకు గాను 467 మార్కులు సాధించి ఉత్తమ ప్రతిభ కనబరిచింది. 2024 మే నెలలో తల్లి చనిపోగా మనస్తాపంతో 7నెలల వ్యవధిలో తండ్రి కూడా చనిపోయాడు. ఇంత బాధలో కూడా తాను అత్యధిక మార్కులు సాధించడంతో గౌతమి తండ్రి స్నేహితులు ఆమెను సన్మానించి రూ.30వేలు నగదు అందించారు. కార్యక్రమంలో రాము, నాగేశ్వరరావు, మురళి, రమేష్, శివసాయి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగాలకు ఎంపికైన మిస్ట్ కళాశాల విద్యార్థులు



ప్లేస్‌మెంట్ సాధించిన విద్యార్థులతో మిస్ట్ కళాశాల యాజమాన్యం

సత్తుపల్లిరూరల్: స్థానిక మదర్‌థెరిస్సా అటానమస్ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ ఫైనల్ ఇయర్ చదువుతున్న సీఎస్సీ, సీఎస్ఎం బ్రాంచ్‌లకు చెందిన ఏడుగురు విద్యార్థులు ఏమోటెక్ కంపెనీలో ఉద్యోగాలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ చలసాని హరికృష్ణ గురువారం తెలిపారు. ఈ విద్యార్థులు శీలం శ్రీలేఖ, షేక్ సభకౌసర్, దారా నాగలక్ష్మి, మల్లాది అఖిల, కానూరి రమ్య, ఉప్పాల రూప నాగశ్రీ, షేక్‌తస్లీమాలకు ఒక్కొక్కరికి రూ.4.5 లక్షల వార్షిక వేతనంతో పైతాన్ ఫుల్‌స్టాక్ డెవలప్లా ఏమోటెక్ పీటీఈ లిమిటెడ్ సింగపూర్ కంపెనీలో ఎంపిక కావటం జరిగిందన్నారు. విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ హరికృష్ణ, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ సాంబశివరావు, చైర్మన్ సత్యనారాయణ, అకాడమిక్ డైరెక్టర్ శ్రీనివాసరావు, ఇంజనీరింగ్ డీన్ జాకీర్ హుస్సేన్, రామచంద్రరావు తదితరులు అభినందించారు.

సాయినాధుడికి ప్రత్యేక పూజలు

ఎర్రుపాలెం: మండలంలోని తక్కెళ్లపాడు, భీమవరం, ఎర్రుపాలెం గ్రామాల్లోని సాయిబాబా ఆలయాల్లో సాయినాధుడికి గురువారం అర్చకులు శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు చేశారు. బాబా విగ్రహాలకు పంచామృతాలతో అభిషేకాలు చేశారు. శ్రీసాయికి కర్పూర హారతులిచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలకేంద్రంలోని బాబా ఆలయంలో పలువురు దాతలు భక్తులకు అన్నదానం చేశారు.

నివాళి..

ఎర్రుపాలెం: మండలంలోని వెంకటాపురం గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకురాలు బొగ్గుల రమణమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. గురువారం కుటుంబసభ్యులు ఆమె దశదినకర్మ నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా కమిటీ అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, మార్కెట్ యార్డ్ చైర్మన్ బండారు నరసింహారావు, మండల కమిటీ అధ్యక్షులు వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి హాజరై రమణమ్మ చిత్రపటానికి నివాళి అర్పించారు. ఆమె భర్త, మాజీ సొసైటీ చైర్మన్ బొగ్గుల శ్రీనివాసరెడ్డిని, కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం తెలిపి సానుభూతి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ అయిలూరి వెంకటేశ్వరరెడ్డి, పీసీసీ మెంబర్ శీలం ప్రతాపరెడ్డి, మాజీ సొసైటీ చైర్మన్ బొగ్గుల గోవర్ధన్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు వేజండ్ల సాయికుమార్ తదితరులున్నారు.

సీపీఎం నాయకుడు..

కొణిజర్ల: ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన సీపీఎం సీనియర్ నాయకుడు ప్రైవేట్ ఎలక్ట్రీషియన్ల సంఘం జిల్లా నాయకుడు కొలిపాక వెంకటేశ్వర్లు మృతికి పలు పార్టీల నాయకులు, ప్రైవేట్ ఎలక్ట్రీషియన్లు ఘనంగా నివాళులర్పించారు. గురువారం వెంకటేశ్వర్లు దశదిన కర్మ సందర్భంగా నిర్వహించిన సంస్మరణ సభలో పలువురు ఆయన చిత్రపటం వద్ద పూలు ఉంచి నివాళులు అర్పించారు.

సంజయ్‌సింగ్వీ మృతికి సంతాపం

సత్తుపల్లిరూరల్: సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ పొలిట్ బ్యూరో సభ్యుడు సంజయ్‌సింగ్వీ ముంబైలోని హిందూజా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందటం పట్ల సత్తుపల్లిలో ఆ పార్టీ జిల్లా కోశాధికారి ఎ.శరత్ గురువారం సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వాసం శ్రీను, కృష్ణ, అంజి, కృష్ణారావు పాల్గొన్నారు.

ఉగ్రదాడికి నిరసనగా కొవ్వొత్తుల ర్యాలీ



కొవ్వొత్తుల ర్యాలీలో ఎమ్మెల్యే రాగమయి దయానంద్, నాయకులు

సత్తుపల్లి: జమ్మూకశ్మీర్‌లోని పహల్గంలో జరిగిన ఉగ్రదాడిని నిరసిస్తూ సత్తుపల్లిలో గురువారం కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి ఆధ్వర్యాన చేపట్టిన ఈ ర్యాలీ ఎమ్మెల్యే నివాసం నుంచి బస్టాండ్ రింగ్‌సెంటర్ వరకు కొనసాగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉగ్రదాడికి కేంద్రమే బాధ్యత వహించాలి, కట్టుదిట్టమైన రక్షణ చర్యలు చేపట్టకపోవడం, ఇంటలిజెన్స్ వైఫల్యంతోనే ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయన్నారు. వల్ల ఈ దాడి జరిగిందన్నారు. 1.80 లక్షల ఆర్మీ ఉద్యోగాలను భర్తీ చేయకపోవటం వల్లే రక్షణ రంగంలో వైఫల్యం చెందిందన్నారు. ఈ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్, ముక్కా శేఖర్‌గౌడ్, దండు ఆదినారాయణ, తోట సుజలరాణి, శివవేణు, చల్లగుళ్ల నర్సింహారావు, ఎం.డీ.కమల్‌పాషా, అలవాల కరుణాకర్, నారాయణవరపు శ్రీనివాసరావు, అట్లూరి సత్యనారాయణరెడ్డి, ఎస్.కే.మౌలాలీ, ఎం.డీ.ఫయాజ్‌అలీ, పసుమర్తి చందర్‌రావు, గాదె చెన్నారావు, భాగం నీరజ, ఆనంద్‌బాబు, ఎం.డీ.రియాజుద్దీన్, షాకీర్ పాల్గొన్నారు.

● **కల్లూరు:** కల్లూరు ఎంపీడీఓ కార్యాలయం ఎదురుగా ఏర్పాటుచేసిన ఇందిరా మహిళా శక్తి టీ స్టాల్‌ను ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి ప్రారంభించారు. అనంతరం ప్రభుత్వ ఆస్పత్రి నిర్మాణ పనులను పరిశీలించారు. మార్కెట్ చైర్మన్ భాగం నీరజ, నాయకులు పసుమర్తి చందర్‌రావు, ఏనుగు సత్యంబాబు, భాగం ప్రభాకర్, బైర్ల కాంతారావు, ఆళ్లకుంట నరసింహారావు, పరిమి భరత్, పొన్నూరు వెంకటేశ్వరరావు, మట్టా రామకృష్ణ, ఏపీఎం బీరవల్లి రాంబాబు, సీసీలు పాల్గొన్నారు.

● **పెనుబల్లి :** పద్మశ్రీ వనజీవి రామయ్య స్ఫూర్తిగా ప్రతిఒక్కరు మొక్కలు నాటాలని ఎమ్మెల్యే రాగమయి సూచించారు. పెనుబల్లి మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన రామయ్య సంతాప సభలో పాల్గొన్న ఆమె కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. ఈకార్యక్రమంలో కల్లూరు మార్కెట్ ఏఎంసీ చైర్మన్ భాగం నీరజ, వైస్ చైర్మన్ రాజబోయిన కోటేశ్వరరావు, ఎంపీడీఓ అన్నపూర్ణ, తహసిల్దార్ గంటా ప్రతాప్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పి.వెంకటేశ్వరరావు, చీకటి రామారావు పాల్గొన్నారు.

పాకిస్తాన్ కుట్రలో భాగమే ఉగ్రదాడి

సత్తుపల్లిటౌన్: జమ్మూకాశ్మీర్‌లో జరిగిన ఉగ్రదాడితో పాకిస్తాన్‌కు సంబంధం ఉందని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర క్రమశిక్షణా సంఘం చైర్మన్ మార్తినేని ధర్మారావు అన్నారు. గురువారం సత్తుపల్లిలోని నియోజకవర్గ బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆ పార్టీ ఖమ్మం పార్లమెంట్ కన్వీనర్ నంబూరి రామలింగేశ్వరరావుతో కలిసి మాట్లాడారు. దేశ వ్యాప్తంగా పర్యాటకులు జమ్మూకాశ్మీర్‌కు వస్తే కేవలం హిందువులను మాత్రమే గుర్తించి చంపేశారని ఆందోళన వ్యక్తం చేశారు. అదే విధంగా రాష్ట్రంలో అకాలవర్షాలతో దెబ్బతిన్న పంటలకు వ్యవసాయ శాఖా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రెవెన్యూశాఖా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి నైతిక బాధ్యత వహించి రైతులను ఆదుకోవాలని కోరారు. వరి ఎకరాకు రూ.20వేలు, మామిడికి రూ.30వేలు తగ్గకుండా నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నియోజకవర్గ కన్వీనర్ బి.వీరంరెడ్డి, మండల, పట్టణ అధ్యక్షులు పాలకొల్లు శ్రీను, శివ, జిల్లా ప్రధాన కార్యదర్శి నున్నా రవి, జిల్లా కార్యదర్శి సుదర్శన్ మిశ్రా, మట్టా ప్రసాద్ పాల్గొన్నారు.



సత్తుపల్లిటౌన్: మాట్లాడుతున్న ధర్మారావు, పక్కన రామలింగేశ్వరరావు

బీజేపీ ఆధ్వర్యంలో..

కల్లూరు: కాశ్మీర్ సంఘటలో ప్రాణాలు కోల్పోయిన హిందువులకు నివాళులర్పిస్తూ.. కల్లూరులో బీజేపీ ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో నిరసన ప్రదర్శన చేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు గుమ్మా రామకృష్ణ, నాయకులు అనీల్, వెంకట రామిరెడ్డి, కృష్ణయ్య, నాగేశ్వరరావు, పెద్ద పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.

'భూ భారతి'తో సమస్యలకు శాశ్వత పరిష్కారం

చింతకాని/బోనకల్: ఇటీవల అమల్లోకి వచ్చిన భూ భారతి చట్టం ద్వారా భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని జిల్లా రెవెన్యూ అధికారి పద్మశ్రీ , ఆర్డీఓ నరసింహారావు తెలిపారు. చింతకాని మండలంలోని నాగులవంచలో, బోనకల్‌లోని ఎస్ఆర్ ఫంక్షన్‌హాల్‌లో భూ భారతి గురువారం ఏర్పాటుచేసిన అవగాహన సదస్సులో వారు మాట్లాడారు. భూయాజమాన్య హక్కుల నిర్ణయం, సాదా బైనామా దరఖాస్తుల పరిష్కారం, రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ తదితర పనులు కొత్త చట్టంతో సులవవుతాయని తెలిపారు. అనంతరం రైతుల సందేహాలు నివృత్తి చేశారు. తహసీల్దార్లు చందర్, అనంతరాజు, ఎంపీడీఓలు ఆశాలత, శ్రీనివాసరావు, ఏఓలు వినయ్‌కుమార్, మానస, ఆత్మ కమిటీ డైరెక్టర్లు కొప్పుల గోవిందరావు, తోటకూరి ప్రగతి, రాష్ట్ర గిడ్డంగుల శాఖ చైర్మన్ నాగేశ్వరరావు, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు దుర్గాప్రసాద్, ఎంఈఓ పుల్లయ్య, ఏపీఎం సురేందర్‌బాబు, మధిర మార్కెట్ కమిటీ చైర్మన్ నరసింహారావు, ఇరిగేషన్ డీఈ వెంకటేశ్వర్లు, ఆత్మా కమిటీ చైర్మన్ రామకోటేశ్వరావు పాల్గొన్నారు.



చింతకాని: సదస్సులో మాట్లాడుతున్న డీఆర్వో పద్మశ్రీ

రేపు కొణిజర్లలో..

కొణిజర్ల: మండలంలోని కొణిజర్లలోని శ్రీరామ కల్యాణ మండపంలో ఈ నెల 26న అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ రాము గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాలలో భూసమస్యలు ఉన్న రైతులు ఈ అవగాహన సదస్సుకు హాజరుకావాలన్నారు.

కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలి

వైరా: ప్రభుత్వం రైతుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను రైతులు వినియోగించుకోవాలని వైరా ఏడీఏ కరుణశ్రీ అన్నారు. గురువారం వైరాలో వ్యవసాయ మార్కెట్ నందు ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. కౌలు రైతులు తప్పనిసరిగా ఏఈఓల వద్ద సర్టిఫికెట్లు తీసుకుని కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తరలించాలన్నారు. కార్యక్రమంలో ఏఓ మయాన్ మంజుఖాన్, ఓడీసీఎంఎస్ ప్రతినిధి శివారెడ్డి, ఏఈఓలు రాజేష్, సైదులు, రాజు, రైతులు రవి, వెంకటేశ్వర్లు, నాగేశ్వరరావు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఏడీఏ కరుణశ్రీ

పోరాటాలతోనే సమస్యల పరిష్కారం



మండల పరిషత్ కార్యాలయం ఎదుట నిరసన చేస్తున్న ఉద్యోగులు

కారేపల్లి: పోరాటాలు చేయకుండా ఉద్యోగుల సమస్యలు పరిష్కారం కావని.. ఉద్యోగ జేఏసీ కోకన్వీనర్ రవీంద్రప్రసాద్ అన్నారు. గురువారం కారేపల్లి మండల పరిషత్ కార్యాలయం వద్ద ఉద్యోగులు నరసన కార్యక్రమాన్ని చేపట్టారు. అనంతరం జరిగిన ఉద్యోగుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావంలో ముఖ్య భూమిక పోషించిన ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికులకు గత ప్రభుత్వం నామమాత్రపు ప్రాధాన్యత ఇచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం ప్రభుత్వం తమ మేనిఫెస్టోలో ఉద్యోగులకు అనేక హామీలు ఇచ్చిందని వాటి అమలుకు 15నెలలు గడిచిన సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. దీనిలో భాగంగా 25న ఖమ్మంలో మోటల్ సైకిల్ ర్యాలీ, సదస్సులను నిర్వహిస్తున్నామని, ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సురేందర్, మండల పరిషత్ సూపరింటెంట్ రమేష్, కార్యదర్శుల సంఘం నాయకులు నెహ్రూ, హరి, అనూష, ఉషా, నవీన్, వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలో సీమంతాలు, అన్న ప్రాసనలు

తల్లాడ: మండలంలోని అన్నారుగూడెంలో నాలుగో కేంద్రంలో గురువారం సీమంతాలు, అన్నప్రాసనలు, అక్షరాభ్యాసాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సత్యావతి మాట్లాడుతూ.. పోషకాహారం వాటిలో తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలు కల్గిన ఆహారం గురించి, చిరుధాన్యాలు, ఆకు కూరలు ఎలా పెంచుకోవాలో వివరించారు. కార్యక్రమంలో కార్యదర్శి వెంకటేశ్వరరావు, ఎఎన్ఎం రాంబాయి, టీచ్చర్ సైదమ్మ, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.



అన్నారుగూడెంలో అన్నప్రాసన వేడుకలో ఐసీడీఎస్ అధికారులు, మహిళలు

క్లుప్తంగా

పాల ఉత్పత్తితో ఆర్థిక పరిపుష్టి

మధిర: పాడి అభివృద్ధితోనే గ్రామాల్లో ఆర్థిక పరిపుష్టి ఉంటుందని పశు వైద్య సిబ్బంది రఫీ అహ్మద్, లక్ష్మణ్‌రావు తెలిపారు. గురువారం చిలుకూరు, మడుపల్లి గ్రామాల్లో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో అన్ని పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది కొండలరావు, కిరణ్, గోపాలమిత్రలు పాల్గొన్నారు.

వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

బోనకల్: వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని మండల ఆయుర్వేదిక్ ఆస్పత్రి ఆధ్వర్యంలో పాఠశాలలో అవగాహన కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఆయుర్వేదిక్ ఫార్మసిస్ట్ పద్మావతి మాట్లాడుతూ.. పిల్లలకు రక్తహీనతను తగ్గించేందుకు పౌష్టికాహారం అందించాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు నాగమణి, రమాదేవి, శిరీష తదితరులు పాల్గొన్నారు.

సభ్యత్వ కార్డులు పంపిణీ



కార్డులు అందిస్తున్న డాక్టర్ రామనాథం

మధిర: మధిర అసెంబ్లీ నియోజకవర్గంలో టీడీపీ సభ్యత్వం తీసుకున్న వచ్చిన కార్డులను పార్టీ ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గ కన్వీనర్ డాక్టర్ వాసిరెడ్డి రామనాథం గురువారం అందజేశారు. మండల, గ్రామ, వార్డు అధ్యక్ష, కార్యదర్శులకు వీటిని అందజేసి ఆయన సభ్యులకు అందించాలని సూచించారు. త్వరలోనే బూత్ కమిటీలను నియమిస్తామని తెలిపారు. నాయకులు మల్లాది హనుమంతరావు, చెరుకూరి కృష్ణారావు, వేమూరి సునీల్, దోమందుల సామేలు, తాజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

మిల్లర్లు నిర్లక్ష్యం చేయొద్దు..

కల్లూరు: మిల్లర్లు రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేయడంలో నిర్లక్ష్యం చేయొద్దని ఆర్డీఓ ఎల్.రాజేందర్ అన్నారు. గురువారం ఆర్డీఓ కార్యాలయంలో డివిజన్ పరిధిలోని 6మండలాల రైస్ మిల్లర్లతో నిర్వహించిన సమీక్ష సమావేశం ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో కల్లూరు, పెనుబల్లి, సత్తుపల్లి, వేంసూరు, తల్లాడ, ఏన్కూరు మండలాల తహసీల్దార్లు, రైస్ మిల్లర్లు పాల్గొన్నారు.

రజకులకు ప్రాధాన్యత ఇవ్వాలి

వైరా: స్వాతంత్ర్యం వచ్చి 78ఏళ్లు గడుస్తున్నా రజకులు ఆర్థికంగా రాజకీయంగా బాగా వెనకబడి ఉన్నారని ప్రభుత్వాలు ఎన్ని మారినా రజకుల బ్రతుకులు మారలేదని రజక సంఘం ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి అన్నారపు వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం తనికెళ్లలో నిర్వహించిన రజక సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీ వర్గీకరణ ప్రకారం రజకులకు సీట్లు కేటాయించాలన్నారు. కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, రామారావు, రమేష్, వెంకన్న, శ్రీను బాబు, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

మే డే విజయవంతం చేయండి

వైరా: శ్రమ జీవుల పండుగ మే డే ను విజయవంతం చేయాలని సీఐటీయూ వైరా పట్టణ కన్వీనర్ అనుమోలు రామారావు పిలుపునిచ్చారు. గురువారం సీఐటీయూ వైరా పట్టణ కమిటీ సమావేశం పాపగంటి రాంబాబు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాలు అవలంభిస్తున్నాయన్నారు. కేంద్రం ప్రవేశ పెట్టిన నాలుగు లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా దేశంలోని కార్మికులంతా ఐక్యం కావాలన్నారు. అమర వీరుల స్ఫూర్తితో అసంఘటిత కార్మికులంతా ఐక్యం కావాలన్నారు. ఈ సమావేశంలో బండ్ల వెంకటేశ్వర్లు, ఫణీతి వెంకటేశ్వర్లు, నూకల వెంకటేశ్వర్లు, కృష్ణమూర్తి, గిరి తదితరులు పాల్గొన్నారు.

జనావాసాల మధ్య మంటలు

మధిర: మధిర మున్సిపాలిటీ పరిధి మడుపల్లిలో జనావాసాల మధ్య గురువారం మంటలు చెలరేగాయి. మడుపల్లి చెరువుకు వెళ్లే మార్గంలో గుర్తుతెలియని వ్యక్తులు చెత్తకు నిప్పంటించగా మంటలు వ్యాపించాయి. సమీపంలో ఉన్న ఇళ్లకు వ్యాపిస్తాయని యాజమానులు భయబ్రాంతులకు గురయ్యారు. పారిశుద్ధ్య సిబ్బంది ఎక్కడపడితే అక్కడ చెత్త వేయకుండా అధికారులు పర్యవేక్షించాలని వారు కోరారు.

ఆటో బోల్తా, ఇద్దరికి గాయాలు

పెనుబల్లి: ఆటో అదుపు తప్పి బోల్తా పడడంతో భార్యాభర్తలకు తీవ్ర గాయాలయ్యాయి. మండలంలోని కు చెందిన జొన్నలగడ్డ మోహన్‌రావు – వెంకటమ్మ దంపతులు గురువారం వారి ఆటోలో పొలం వద్దకు వెళ్లి తిరిగి వస్తున్నారు. ఈక్రమాన ఆటో అదుపుతప్పి బోల్తా పడగా ఇద్దరు గాయపడడంతో ప్రాథమిక చికిత్స అనంతరం ఖమ్మం తరలించారు.